


చీనీ టన్ను రూ. 24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/22.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

బంద్ విఫలం

- యథావిధిగా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు
- అన్ని రూట్లలో ఎప్పటిలాగే నడిచిన బస్సులు
- ముందస్తు జాగ్రత్తగా ప్రైవేటు స్కూళ్ల మూసివేత
- బంద్‌కు ముందుకు రాని టీడీపీ శ్రేణులు
- తూతూ మంత్రంగా రోడ్లపైకి ప్రధాన నాయకులు
- ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు



అనంతపురంలో సోమవారం యథావిధిగా తిరుగుతున్న వాహనాలతో కిక్కిరిసిన సుభాష్‌రోడ్డు

సాక్షి ప్రతినిధి, అనంతపురం స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలుకెళ్లిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సోమవారం చేపట్టిన బంద్ ఉమ్మడి జిల్లాలో విఫలమైంది. టీడీపీకి పట్టున్న జిల్లా అని చెప్పుకునే నాయకులు, కార్యకర్తలు కానీ, ప్రజలు కానీ బంద్‌లో పాల్గొనకుండా దిమ్మదిరిగే షాక్ ఇచ్చారు. దీంతో ఇటు అనంతపురం జిల్లా, అటు శ్రీసత్యసాయి జిల్లాలో బంద్ ప్రభావం కనిపించ లేదు. అక్కడక్కడా కొంతమంది నాయకులు రోడ్డెక్కినా ప్రజలకు అసౌకర్యం కలగకుండా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మెజారిటీ జనం... చంద్రబాబు తప్పు చేశాడు, జైలుకెళ్లాడు అన్న భావనతో ఉన్నట్లు కనిపించింది. నాలుగున్నరేళ్లుగా ప్రజా సమస్యలు పట్టని టీడీపీ నేతలు నేడు బంద్‌కు పిలుపునిస్తే ఎలా సహకరిస్తారని ప్రజలు మండిపడ్డారు. ఇక బంద్‌కు మద్దతిచ్చిన జనసేన పార్టీ ప్రభావం ఇసుమంతైనా లేకపోవడం గమనార్హం.

యథావిధిగా బస్సులు.. షాపులు

శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో అన్ని రూట్లలోనూ ఆర్టీసీ బస్సులు తిరిగాయి. ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందిలేకుండా అన్ని రూట్లకూ బస్సులు తిప్పినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రోజులాగే బస్సులు తిరగడంతో బంద్ ప్రభావం కనిపించనే లేదు. అంతేకాదు రెండు జిల్లాల్లో ప్రతి మండల కేంద్రంలో షాపుల నిర్వహణ యథావిధిగా కొనసాగింది. పుట్టపర్తి, అనంతపురం పట్టణాల్లో ఉదయం 9 గంటల నుంచే షాపులు తెరవడంతో ఎక్కడా వ్యాపారానికి ఇబ్బంది కనిపించలేదు. కాగా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా రెండు జిల్లాల్లో ప్రైవేటు స్కూళ్లు మూసేశారు. కానీ ప్రభుత్వ స్కూళ్లు కొన్ని చోట్ల మినహా యథావిధిగా నడిచాయి.

ముందుకు రాని శ్రేణులు

ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు కార్యకర్తలు బంద్‌లో పాల్గొనేందుకు ససేమిరా అనడంతో తెలుగుదేశం నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఎక్కడ కూడా పట్టుమని పదిమంది కార్యకర్తలు నాయకుల వెంట వచ్చిన పరిస్థితి లేదు. పెనుకొండలో శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి పదిమందితో జాతీయ రహదారిపై కూర్చునే సరికే పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత కొద్దిమంది మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అనంతపురం అర్బన్‌లో మాత్రం ఎక్కడా బంద్ లేదు. ధర్మవరంలో ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా డీఐజీ అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేశారు. హిందూపురంలో ఉదయం కొద్దిసేపు తెలుగుదేశం కార్యకర్తలు హడావుడి చేసినా ఆ తర్వాత పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవడంతో బంద్ ప్రభావం కనిపించలేదు. మడకశిర, కదిరి, రాయదుర్గం, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో బంద్ ప్రభావం నామమాత్రంగా కూడాలేదు.

నేతల ఓవరాక్షన్

- ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేక పోవడంతో కొంతమంది రోడ్డెక్కి ఓవరాక్షన్ చేశారు. మాజీ మేయర్ మదమంచి స్వరూప విద్యుత్‌నగర్ సర్కిల్‌లో రోడ్డుపై టైర్లు వేసి నిప్పుపెట్టారు. టీడీపీ అధికార ప్రతినిధి సంగా తేజస్విని 44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించాలని చూడగా.. పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు.
- అనంతపురంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును శ్రీకంఠం సర్కిల్ వద్ద టీడీపీ నాయకుడొకరు అడ్డుకున్నారు. బంద్‌కు పిలుపునిస్తే ఎలా తిరుగుతావంటూ డ్రైవర్‌ను దూషిస్తూ బస్సు అద్దాన్ని పగులగొట్టారు. వన్‌టౌన్ పోలీసులు వచ్చి ఆందోళనకారుడిని అదుపులోకి తీసుకున్నారు.

అన్నీ సజావుగా సాగాయి



బంద్ పిలుపు నేపథ్యంలో జిల్లాలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం నుంచే రవాణా సౌకర్యం (బస్సులు) ఇబ్బంది లేకుండా చూశాం. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేవు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలన్నీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నాం.

–కె.శ్రీనివాసరావు, ఎస్పీ, అనంతపురం



అనంతపురంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

సజావుగా ఆర్టీసీ రాకపోకలు



జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల్లో ఆర్టీసీ బస్సు రాకపోకలు సజావుగా సాగాయి. బంద్ పిలుపు నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాం. అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ డిపోల పరిధిలో మొత్తం 413 బస్సులు ఉండగా అన్ని సర్వీసులూ తిప్పాము.

– సుమంత్ ఆర్ ఆదోని, జిల్లా ప్రజా రవాణా అధికారి

న్యూస్‌రీల్

వైద్య సేవలపై సంతృప్తి



హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

గార్లదిన్నె: మర్తాడు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ కమిటీ సభ్యులు పరిశీలించారు. పలు రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామంలో కొంతమంది ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సేవలపై కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ ఆశాబక్షి, డాక్టర్ సుబ్రజ్యోతి రావు, జిల్లా నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ అధికారి శైలజ, డాక్టర్ దిలీప్‌కుమార్, ఎమ్‌పీహెచ్‌ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా ప్రణాళికలో సమూల మార్పులు



మాట్లాడుతున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానం–2020 మేరకు డిగ్రీ కోర్సు విద్యా ప్రణాళికలో సమూల మార్పులు చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూలోని పాలిమర్ సైన్సెస్ విభాగంలో సోమవారం అనుబంధ డిగ్రీ కళాశాలల బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్, మైనర్ డిగ్రీ సబ్జెక్టులు, డిగ్రీ ఆనర్స్, డిగ్రీ ఆనర్స్ విత్ రీసెర్చ్‌లకు సంబంధించిన అన్ని సబ్జెక్టుల సిలబస్ గురించి వీసీ రామకృష్ణారెడ్డి చర్చించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి, రెండో సెమిస్టర్ సిలబస్ రూపకల్పన పకడ్బందీగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంగోపాల్ పాల్గొన్నారు.

అందుబాటులో ప్రత్యామ్నాయ విత్తనాలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 4,570 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. 3,622 క్వింటాళ్ల ఉలవలు, 62 క్వింటాళ్ల కొర్రలు, 481 క్వింటాళ్ల అలసందలు, 206 క్వింటాళ్ల పెసలు, 200 క్వింటాళ్ల జొన్నలు ఆర్‌బీకేల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. 80 శాతం రాయితీతో పంపిణీ చేస్తామన్నారు. సాధ్యమైనంత తొందరగా ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలను ఉపయోగించుకుని ఒక ఎకరా కూడా ఖాళీగా పెట్టకుండా ఏదో ఒక పంట వేసుకోవాలని తెలిపారు. సాగు చేసిన అన్ని రకాల పంటలను ఆర్‌బీకే అసిస్టెంట్ల ద్వారా ఈ–క్రాప్ చేయించుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందవచ్చన్నారు.

మట్టి గణపతులతో పండుగ చేసుకోండి



కరపత్రాలను విడుదల చేస్తున్న జేసీ, డీఆర్‌ఓ

అనంతపురం అర్బన్: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులతో పండుగ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. వినాయక చవితిని మట్టి ప్రతిమలతో జరుపుకుందామంటూ ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. వినాయక చవితి విశిష్టతను చాటేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజినీర్ కిషోర్‌రెడ్డి, ఏఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' విజయవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి ఆర్డీఓలు, ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు ఎంపీడీలు, ఇతర మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య శ్రేయస్సు లక్ష్యంగా ప్రభుత్వం ఈ నెల 30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభించనుందన్నారు. జిల్లాలోని 431 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

పంటలను కాపాడాలి

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యిందని, ఇదివరకే సాగు చేసిన పంటలను కాపాడేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ–క్రాప్ నమోదు ఈ నెల 15లోగా పూర్తి చేయాలన్నారు. వచ్చే సీజన్‌లో పంటల సాగుపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

భవనాలు ప్రారంభించాలి

జిల్లాలో నిర్మాణం పూర్తయిన ఆర్బీకేలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవనాలను పది రోజుల్లోగా ప్రారంభించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద పనులు గ్రౌండింగ్ కావాలన్నారు. పూర్తయిన పనులకు బిల్లులను వారంలోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలన్నారు.

అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజల నుంచి 178 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతగా పరిష్కరించాలని చెప్పారు.



సమస్య వింటున్న కలెక్టర్ గౌతమి

అర్జీల్లో కొన్ని..

- దివ్యాంగుడినైన తనకు జీవనాధారం కోసం వ్యవసాయ భూమి మంజూరు చేయాలని అనంతపురంలోని మరవకొమ్మ కాలనీకి చెందిన మద్దిలేటి విన్నవించాడు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తనపైనే తల్లి, తమ్ముడూ ఆధారపడ్డారన్నారు. ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ ద్వారా తనకు చియ్యేడు గ్రామ సర్వే నంబరు 155లో 2.50 ఎకరాలు ఇచ్చేందుకు సర్వే కూడా చేశారని, అయితే పట్టా అందలేదని అర్జీలో పేర్కొన్నాడు.
- బీఏ వరకు చదువుకున్న తనకు ఉద్యోగం ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని నగరంలోని రెండో రోడ్డుకు చెందిన దివ్యాంగుడు గాదిలింగప్ప 'స్పందన'లో అర్జీ సమర్పించాడు. తన తండ్రి గత నెల చనిపోయాడని, మధుమేహవ్యాధి కారణంగా తన తల్లి కాలు తొలగించారని చెప్పాడు. కుటుంబ పోషణ కోసం ఉపాధి చూపాలని కోరాడు.
- తాడిపత్రి మండలం తేరన్నపల్లి పంచాయతీ నందలపాడు పొలం సర్వే నంబరు 226లో 78 సెంట్ల భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని నందలపాడుకు చెందిన ఎం.వెంకటరాముడు తెలిపాడు. ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు.

బెంబేలెత్తుతున్న బాబు అండ్ కో

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: కుంభకోణాల్లో భాగస్వాములైన వారిని మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ భయపెడుతోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. లోతుగా విచారణ చేసి పక్కా ఆధారాలు సేకరిస్తుండడంతో బాబు అండ్ కో బెంబేలెత్తిపోతోందని ధ్వజమెత్తారు. సోమవారం కళ్యాణదుర్గంలోని తన స్వగృహంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ అన్నీ చంద్రబాబేనన్నారు. తాను అధికారంలోకి వస్తే ఐటీ ఫామ్‌లు, వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేస్తానని, వర్క్ ఫ్రం హోంతో ఉన్నచోటే పనిచేసుకోవచ్చని చెప్పిన పెద్ద మనిషి రూ.వందల కోట్లు ఎలా దోచేశారని నిలదీశారు. రాజధాని భూములకు సంబంధించి వేల ఎకరాలను బినామీల పేరిట కొట్టేశారన్నారు. రాజధాని ప్రాంతం ఓసారి ఏలూరి వైపు వస్తుందని, మరోసారి నూజివీడు వైపు వస్తుందని, ఇంకోసారి నందిగామ జగ్గయ్యపేట వైపు వస్తుందని ప్రజలను మభ్యపెట్టి అమరావతి చుట్టూ ఉన్న వేల ఎకరాలను బినామీలకు కట్టబెట్టారన్నారు. చివరకు గుంటూరులో కాదు, విజయవాడలో కాదు... తాను కొన్న భూముల సమీపంలో రాజధాని ఏర్పాటు చేస్తున్నానని ప్రకటించిన దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయారన్నారు. ఏపీలో సైతం అసైన్డ్ భూములను బాబు అండ్ కో దోపిడీ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, సామాజిక వర్గాలను మోసం చేశారని విమర్శించారు.

ఫైబర్‌నెట్ స్కామ్‌లో ప్రశ్నిస్తే తప్పేంటి?

ఏపీ ఫైబర్‌నెట్ స్కామ్‌లో చంద్రబాబుతో పాటు ఈనాడు రామోజీ బంధువు ఆర్‌వీఆర్ రఘు కూడా ఐటీ శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయారని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో చంద్రబాబును అధికారులు ప్రశ్నిస్తే తప్పేముందని అన్నారు. రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నివేశన స్థలాలు ఇవ్వకుండా, పక్కా ఇళ్ల నిర్మాణం చేయకుండా రూ.వందల కోట్లు మింగేశారని ఆరోపించారు. అనేక కుంభకోణాల్లో కొన్నిమాత్రమే వెలుగులోకి వస్తే.. వాటిని కూడా విచారణ జరపకూడదంటూ టీడీపీ, ఎల్లో మీడియా గగ్గోలు పెడుతున్నాయన్నారు. గతంలో ఇందిరా గాంధీ, జయలలిత వంటి వారు ఆరోపణలు ఎదుర్కొన్నవారేనని, విచారణకు కూడా సహకరించారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంత రైతులు, 'స్కిల్' స్కాంలో బాధిత యువత, మహిళల ఉసురు తగిలి చంద్రబాబుకు ఈ గతి పట్టిందన్నారు. రాష్ట్రంలో ఇక టీడీపీ భూస్థాపితం కానుందని మంత్రి జోస్యం చెప్పారు.

దేహదానం.. ఆదర్శం





ఓబుళమ్మ కళ్లను సేకరించిన దృశ్యం, మృతదేహాన్ని అప్పగిస్తూ పత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న భర్త వెంకటపతి

- వృద్ధురాలి ఆకస్మిక మృతి
- నేత్రదానంతో పాటు వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

అనంతపురం క్రైం: మరణించిన తన భార్యను ఖననం చేసి మట్టిపాలు చేయడం కన్నా వైద్య విద్యార్థులకు ఉపయోగడేలా మృతదేహాన్ని వైద్యకళాశాలకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు విశ్రాంత తెలుగు పండిట్ వెంకటపతి. వివరాల్లోకెళ్తే... నగరంలోని అరవిందనగర్ సీఎస్‌ఐ చర్చి సమీపంలో వెంకటపతి, సి.ఓబుళలమ్మ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. కూతుళ్లకు వివాహాలయ్యాయి. దంపతులు కుమారుడి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఓబుళమ్మ (64) ఆకస్మికంగా మృతి చెందారు. తొలుత ఓబుళమ్మ నేత్రాలను దానం చేయాలని భర్త వెంకటపతి భావించారు. తర్వాత తమ్ముని కుమారుడు శ్రీనివాస్, వారి పిల్లలు వైద్యులు, తదితర కుటుంబీకులతో కలసి పునరాలోచించారు. కాల్చినా..పూడ్చినా బూడిద, మట్టిపాలవుతుందని.. అదే మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తే వైద్య విద్యార్థులకైనా ఉపయోగపడుతుందని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేసిన పత్రాన్ని ఓబుళపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవికి అందజేశారు. వైద్య విద్యనభ్యసించే విద్యార్థులకు మొదటి సంవత్సరంలో అనాటమీ (అంతర్నిర్మాణ శాస్త్రం) సబ్జెక్టులో మృతదేహాల అవయవాలను శోధించే ప్రక్రియ ఉంటుంది. తొలుత ఓబుళమ్మ కళ్లను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ షారోన్‌సోనియా, అధ్యాపకులు డాక్టర్ బోనాల షహజీర్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, అధ్యాపకులు పునర్జీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి భార్యను కాపాడబోయి...

- ప్రాణాలు కోల్పోయిన మిత్రుడు
- మృతుడు ఉత్తరప్రదేశ్ వాసి

అనంతపురం సిటీ: రైలు కిందపడబోతున్న స్నేహితుడి భార్యను కాపాడబోయి ఓ మిత్రుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌లోని ఆవాజ్‌పూర్‌కు చెందిన రక్షపాల్ (34), తన స్నేహితుడు మున్నాకుమార్, అతని భార్య హీరామతితో కలసి రాప్తాడు మండలం హంపాపురం వద్ద ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో దిన కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉత్తరప్రదేశ్ బయల్దేరిన మున్నాకుమార్, హీరామతి దంపతులను రైలు ఎక్కించేందుకు తోడుగా రక్షపాల్ అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రాత్రి 11.30 గంటలకు రైలు స్టేషన్‌కు చేరుకోగానే బోగిని వెతుక్కొని మున్నాకుమార్ ఎక్కేలోపే రైలు ముందుకు కదిలింది. ఆ సమయంలో హీరామతి రైలు ఎక్కే ప్రయత్నంలో కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు రైలుకు మధ్య ఇరుక్కుపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో రక్షపాల్ కూడా రైలు–ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోయాడు. బోగీలోని చైన్‌ను మున్నాకుమార్ లాగడంతో రైలు కొద్ది దూరం వెళ్లి ఆగింది. అప్పటికే హీరామతి కుడి పాదం తెగిపడింది. రక్షపాల్ తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు రక్షపాల్ మృతి చెందాడు. హీరామతిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. రక్షపాల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్,
డో.నం: 6-2-39, కోవూరునగర్, అనంతపురం.
ఫోన్ నంబరు : 9912220717

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 58 వినతులు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 58 వినితులు అందాయి. అర్జీదారులను ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. గతంలో ఫిర్యాదు చేసినా సమస్యకు పరిష్కారం చూపని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో నేరుగా మాట్లాడారు. బాధితులకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆస్తి వివాదాలు, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటండి



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్: త్వరలో మహారాష్ట్ర వేదికగా జరిగే జాతీయస్థాయి అండర్–15 బాలికల చెస్ పోటీల్లో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ నాగార్జున కర్ణాటకమ్ పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుండి 10వ తేదీ వరకూ గుంతకల్లులోని పెంగ్విన్ యాక్టివిటీస్ క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 బాలికల ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో విశాఖకు చెందిన ప్రసాద్‌జాగృతి (మొదటి), తిరుపతికి చెందిన వి.త్రిపురాంబిక (ద్వితీయ), గుంటూరుకు చెందిన టి.శ్రీలాస్య (తృతీయ), వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన లాస్యశ్రీ మట్టం (నాల్గో) ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఇది ఆరంభం మాత్రమే

- చంద్రబాబు అవినీతి చిట్టా ఇంకా చాలా ఉంది
- అమరావతి, పోలవరం, ఫైబర్ గ్రిడ్ అక్రమాల్లోనూ దోపి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం క్రైం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కుప్పం ఎమ్మెల్యే, మాజీ సీఎం చంద్రబాబుకు విధించిన రిమాండ్ ఆరంభం మాత్రమేనని, ఆయన అవినీతి చిట్టా ఇంకా చాలా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. అమరావతి కుంభకోణం, పోలవరం, ఫైబర్ గ్రిడ్ అక్రమాలపై లోతైన విచారణ చేపడితే వీటన్నింటిలోనూ దోషిగా తేలేది చంద్రబాబు మాత్రమేనని స్పష్టం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలసి జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు రిమాండ్‌కు సంబంధించి టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమాలపై 2021లోనే కేసు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు సుదీర్ఘకాలం పాటు లోతుగా విచారణ జరిపి, రూ.241 కోట్ల అక్రమాలకు అప్పటి సీఎం చంద్రబాబునే కారణమని తేల్చారన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించాల్సిన అవసరం సీఐడీకి లేదన్నారు. బాబు రిమాండ్‌పై టీడీపీ నాయకులు సాగిస్తున్న విష ప్రచారాన్ని, వారిచ్చిన బంద్‌కు స్పందించకుండా ప్రజలే తిప్పికొట్టారన్నారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్ మాట్లాడుతూ... సీఎం పదవి కోసం సొంత మామ ఎన్టీఆర్‌నే చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. స్కిల్ స్కాం పక్కా బాబు కనుసన్నల్లోనే జరిగిందని సీఐడీ ఆధారాలతో సహా నిరూపించిందన్నారు. చంద్రబాబు అరెస్టుతో ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుందన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మాట్లాడుతూ... సరైన ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ పోలీసులకు కటకటాలకు పంపారన్నారు. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులు, రాజకీయ ప్రేరేపితం లేదన్నారు. అలాంటి ఆలోచనే ప్రభుత్వానికి ఉంటే స్కిల్ స్కాం బయటపడ్డప్పుడే అరెస్ట్ చేసేవారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కక్ష సాధింపులకు తావులేదన్నారు. సమావేశంలో రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, సీపీ వీరన్న, నాయకులు కేశవరెడ్డి, ముహేబ్, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠాకు అధ్యక్షుడు చంద్రబాబే

- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: వరుస కుంభకోణాలకు పాల్పడి ప్రజాధనాన్ని అడ్డంగా దోచేసిన దోపిడీ ముఠాకు అధ్యక్షుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునే అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. తాడిపత్రిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీంల పేరిట స్కామ్‌లు చేయడం చంద్రబాబుకు కొత్తేమి కాదన్నారు. కాకపోతే ఇన్నాళ్లు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారని, చివరకు పాపం పండి జైలు పాలయ్యారన్నారు. టీడీపీ నాయకులు సైతం చంద్రబాబు స్కాంలపై నోరు మెదపకుండా ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందంటూ గగ్గోలు పెడుతున్నారన్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓటుకు నోటు కేసులో ప్రభుత్వాలను మేనేజ్ చేసి బయటపడ్డారన్నారు. అలాగే దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సైతం 26 కేసుల్లో స్టేలు తెచ్చుకుని బయటపడ్డారన్నారు. వ్యవస్థలను ఎలాగైనా మేనేజ్ చేయగలనన్న ధైర్యంతోనే వరుస కుంభకోణాలకు పాల్పడుతూ వచ్చారన్నారు. నిరుద్యోగులకు మంచి చేయాల్సింది పోయి, స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ. వందల కోట్లు దిగమింగడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ మొదలు రిమాండ్‌కు వెళ్లేంతవరకూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు ఎంతో ఉత్కంఠగా టీవీల ఎదుటనే గడిపారన్నారు. చంద్రబాబుకు న్యాయస్థానం విధించిన రిమాండ్‌ను రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో స్వాగతించారన్నారు. టీడీపీ శ్రేణులు బంద్‌కు పిలుపునిచ్చినా ప్రజలు స్పందించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు చేసిన ద్రోహంతో ఇంత కాలం ఘోషిస్తున్న ఎన్టీఆర్ ఆత్మ ఇప్పుడు శాంతిస్తుందన్నారు. ఇంకా చంద్రబాబు దోపిడీ ముఠాలో అచ్చెన్నాయుడు, గంటా, నారాయణ, జేసీ దివాకర్ రెడ్డిలాంటి వారు చాలా మంది ఉన్నారన్నారు. అమరావతి, సింగపూర్ అగ్రిమెంట్లు వంటి వాటిపై విచారణ చేపడితే చంద్రబాబు అక్రమాలు మర్ని వెలుగులోకి వస్తాయన్నారు.

టీడీపీకి ప్రజామద్దతు కరువు

- తప్పు చేయలేదని చంద్రబాబు చెప్పలేకపోయారు
- మాజీ ఎమ్మెల్యే విశ్వ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: కుప్పం ఎమ్మెల్యే, మాజీ సీఎం నారా చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు ప్రజల నుంచి మద్దతు కరువైందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వజ్రకరూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్ అంశాన్ని ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు పక్కదోవ పట్టిస్తూ ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. న్యాయవ్యవస్థపై గౌరవం ఉన్న ఎవ్వరైనా కోర్టు తీర్పు శిరసావహించాల్సిందేనన్నారు. ఇందుకు విరుద్ధంగా బంద్‌కు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. విజ్ఞత లోపించినా టీడీపీ నేతల పిలుపునకు ప్రజలెవ్వరూ స్పందించకపోవడం గమనార్హమన్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే చంద్రబాబు పట్ల వ్యతిరేకత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. దేశంలోనే అతిపెద్ద అవినీతి పరుడు చంద్రబాబు అన్నారు. సరైనా ఆధారాలు లేకపోతే ఏ న్యాయస్థానమూ నిందితుడిగా గుర్తించి, రిమాండ్‌కు ఆదేశించదన్నారు. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని సాక్ష్యాధారాలతో సీఐడీ అధికారులు నిరూపించడంతో చంద్రబాబును రిమాండ్‌కు తరలించారన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, నాయకులు వెంకటరెడ్డి, ఉస్మాన్, రామకృష్ణ, తేజేశ్వరరెడ్డి, అమర్‌నాథ్, ప్యాపిలి కిష్ట, భీమప్ప, ప్యాపిలి వీరా, రఘుపతి, రామాంజినేయులు, కిష్టప్ప, గోవర్దన్ పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ పేదలది

కదిరి అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) సంపూర్ణంగా పేదలకు చెందినదేనని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. కదిరిలోని సైదాపురం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో బ్యాంక్ నూతన కార్యాలయాన్ని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డితో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలఅభ్యున్నతికి బ్యాంక్ ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. బ్యాంక్ సేవలను అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా బలపడాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 28 బ్రాంచ్‌లతో నడుస్తున్న డీసీసీబీ... ప్రభుత్వ పథకాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తోందని చైర్‌పర్సన్ లిఖిత అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ రూ.1,700 కోట్లకు లావాదేవీలు చేరుకున్నాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.110 కోట్ల టర్నోవర్‌తో కదిరి బ్రాంచ్ అన్నింటా ముందంజలో ఉండడం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఈఓ రాంప్రసాద్, డీజీఎం సుభదేవ్‌బాబు, డీసీసీబీ మేనేజర్ వెంకటాచలం, డైరెక్టర్ హైదర్‌వలీతో పాటు పలు సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



పవన్ కల్యాణ్

యాడికి: తాడిపత్రిలో పని ఉందని చెప్పి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఓ భార్య సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. నిట్టూరు గ్రామానికి చెందిన పవన్ కల్యాణ్ (23) అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 3వ తేదీన తాడిపత్రిలో పని ఉందని చెప్పి వెళ్లిన అతడు మళ్లీ ఇంటికీ రాలేదు. బంధువులు, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం లభించక పోవడంతో లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా దొణగంగమ్మ జాతర



దొణ వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

గుమ్మఘట్ట (రాయదుర్గం రూరల్): రాయదుర్గం మండలం టి.వీరాపురం సమీపంలో వెలసిన దొణగంగమ్మ జాతరకు జనం పోటెత్తారు. శ్రావణ మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని దొణ గంగమ్మను జలధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి వేలాది భక్తుల సమక్షంలో దొణ వరకూ లాగారు. సాయంత్రం తిరిగి గమ్యస్థానానికి చేర్చారు. అమ్మవారిని దర్శించేందుకు కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. దొణ చుట్టూ వృషభాలతో ప్రదక్షణలు చేయించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి, ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి జాతరలో పాల్గొని అమ్మవారి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు హొన్నె మల్లికార్జున, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, మాజీ ఎంపీపీ భారతి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ప్రకాష్, మహేష్, అంజినయ్య, వార్డు సభ్యుడు శంకర్, ఈడిగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాతాళగంగ పదిలం

- వర్షాభావ పరిస్థితుల్లోనూ తగ్గని భూగర్భజలాలు
- తాజా నీటిమట్టం 9.19 మీటర్లుగా నమోదు
- యల్లనూరు మినహా 30 మండలాలు సేఫ్‌జోన్‌లో
- 12 మండలాల్లో స్వల్పంగా తగ్గిన భూగర్భజలమట్టం



శెట్టూరు మండలం కనకూరులో బోరుబావు నుంచి ఉధృతంగా వస్తున్న నీళ్లు

అనంతపురం అగ్రికల్చర్: ఈ సీజన్‌లో ఆశించిన స్థాయి లో వర్షాలు నమోదు కాకున్నా... భూగర్భజలాలు మాత్రం పదిలంగా ఉన్నాయి. వర్షాభావం పరిస్థితుల్లోనూ నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో సేద్యపు పనులు సజావుగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 ఫిజోమీటర్ల నుంచి భూగర్భ జలవనరుల శాఖ తాజాగా సేకరించిన గణాంకాలు పరిశీలిస్తే జిల్లా సగటు నీటి మట్టం 9.19 మీటర్లుగా నమోదైంది.

2019లో సగటు నీటి మట్టం 27 మీటర్లు

చంద్రబాబు సీఎంగా ఉన్న 2014–18 మధ్య కాలంలో భూగర్భ జల మట్టం 15 నుంచి 25 మీటర్లుగా ఉండేది. ఏ ఒక్క సీజన్‌లోనూ 15 మీటర్ల లోపు నీటి మట్టం నమోదు కాలేదు. చివరకు 2019లో భూగర్భజలమట్టం 27 మీటర్లుగా నమోదైందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ జగన్ ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత గత ఐదేళ్లుగా విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ నీటి మట్టం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఒకానొక దశలో 6 మీటర్ల అత్యంత గరిష్టస్థాయికి నీటిమట్టం చేరింది. అయితే ఈ సారి వర్షాలు కాస్త మందగించడంతో కొంతవరకు తగ్గుదల నమోదైనా.. సగటు నీటిమట్టం 10 మీటర్ల లోపే ఉండడం గమనార్హం.

30 మండలాలూ సేఫ్‌జోన్‌లో..

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా జిల్లాలోని 30 మండలాలు ఇప్పటికీ సురక్షిత జాబితా (సేఫ్‌జోన్)లో ఉన్నాయి. పరిమితికి మించి భూగర్భజలాలు వాడుతున్న యల్లనూరు మండలం మాత్రమే డేంజర్‌జోన్‌లో ఉంది. మరో 12 మండలాల్లో గత నాలుగేళ్లతో పోల్చుకుంటే నీటిమట్టం కాస్త తగ్గింది. 3 మీటర్ల లోపు ఒక మండలం ఉండగా, 3 నుంచి 8 మీటర్ల మధ్య 15 మండలాలు, 8 నుంచి 15 మీటర్ల మధ్య నీటిమట్టం కలిగినవి 12 మండలాలు ఉన్నాయి. రాయదుర్గం, యాడికి మండలం నగరూరు ఫిజోమీటర్లలో నీటిమట్టం బాగా తగ్గినట్లు విశ్లేషించారు. పెద్దపప్పూరు మండలం పెద్దఎక్కలూరు, గార్లదిన్నె ఫిజోమీటర్లలో నీటి మట్టం బాగా పైపైకి వచ్చినట్లు గుర్తించారు. బెళుగుప్ప, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుత్తి, కళ్యాణదుర్గం, కణేకల్లు, పామిడి, పుట్లూరు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో నీటిమట్టంలో కొంచెం తగ్గుదల నమోదైంది.

ఇబ్బంది లేదు

భూగర్భజలాలు కొంత తగ్గినప్పటికీ ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవు. ఈ సీజన్‌లో వర్షాల రూపంలో 48 టీఎంసీలు ప్రవహించగా అందులో 6 టీఎంసీల వరకు భూగర్భంలో ఇంకిపోయాయి. సాంకేతికపరంగా చూస్తే ప్రస్తుతం జిల్లాలో 39 టీఎంసీలు భూగర్భ జలాలు ఉండగా అందులో 15 టీఎంసీలు వినియోగంలో ఉంది. ఇంకా 24 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. 1,87,610 వ్యవసాయ బోర్ల నుంచి పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి. కేవలం 12 గ్రామాల్లో మాత్రమే వాల్టా చట్టం అమలులో ఉంది. – కె.తిప్పేస్వామి, భూగర్భజలశాఖ డీడీ

విద్యుదాఘాతంతో రైతు మృతి



లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహం

తాడిమర్రి: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం దాడితోటకు చెందిన నొసం లక్ష్మీనారాయణరెడ్డి (63) అదే గ్రామ శివారులో తన కున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు మడికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన మోటారు తీగలను 11కేవీ విద్యుత్ తీగలకు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కుప్పకూలిపోయారు. విషయాన్ని గమనించిన పక్క తోటలోని రైతులు వెంటనే అక్కడకు చేరుకుని సపర్యలు చేసి, చికిత్స కోసం తాడిమర్రి పీహెచ్‌సీకి తరలిస్తుండగానే మృతి చెందారు. మృతునికి భార్య నారాయణమ్మ, కుమారుడు సంజీవరెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లకు చెందిన వన్నూరు సాహెబ్ (58) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనారోగ్యంతో బాధపడుతున్న వన్నూరు సాహెబ్‌కు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పర్యాటక విశిష్ట సేవా పురస్కారాలు

అనంతపురం కల్చరల్: పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు టూరిజం శాఖ విశిష్ట సేవా పురస్కారాలందిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా టూరిజం శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డి సోమవారం వెల్లడించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం 40 కేటగిరీల్లో అవార్డులందిస్తోందన్నారు. ఆసక్తి కల్గిన వారు ఈ నెల 19లోపు దరఖాస్తులను www.a poturirm.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 91211 44110, 91211 44088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్‌పై అనంతపురంలోని ఎస్కేయూ వద్ద ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (రూడ్‌సెట్)లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 10 నుంచి 35 సంవత్సరాల్లోపు గ్రామీణ నిరుద్యోగ యువకులు అర్హులు. పదో తరగతి వరకు విద్యార్హత, ఆధార్, రేషన్ కార్డు నకళ్లతో దరఖాస్తు చేసుకోవాలి. ఆసక్తి ఉన్నవారు 83099 15577 నంబర్‌లో సంప్రదించవచ్చు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను తాడిపత్రి సీఐ హమీద్‌ఖాన్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో సోమవారం ఉదయం తాడిపత్రిలోని పెన్నానది నూతన బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తాడిపత్రి నుంచి చుక్కలూరు వైపుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న యల్లనూరు నివాసి కటిక ఓబులేసును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా... తాడిపత్రి నుంచి కర్నూలు జిల్లా డోన్‌కు తరలిస్తున్నట్లుగా అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం



మృతుడు నాగరాజు

యాడికి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని చిన్న వేపమాను వీధికి చెందిన నాగరాజు (35)కు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలున్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న నాగరాజుకు కొన్ని రోజుల క్రితం చేతికి బలమైన గాయమైంది. అప్పటి నుంచి గాయం మానకపోవడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం పొలం పనులకు నాగమణి వెళ్లింది. ఆ సమయంలో ఇంటి పట్టునే ఉన్న నాగరాజు.. నొప్పి తీవ్రత భరించలేక దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి బయట ఆడుకుంటున్న పిల్లలు ఎంత సేపటికీ తండ్రి వాకిలి తీయకపోవడంతో చుట్టుపక్కల వారికి తెలపడంతో వార్లెళ్లి పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న నాగరాజును గుర్తించి, కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించి, నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పొలం తగాదాలో ఇద్దరిపై దాడి

యాడికి: పొలం తగాదాలో దాయాదులు చేసిన దాడిలో దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం చందన గ్రామానికి చెందిన వలిపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి అన్నదమ్ములు. అదే గ్రామ సమీపంలోని రాయలచెరువు రహదారిలో శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాజశేఖరరెడ్డికి వ్యవసాయ పొలం ఉంది. సోమవారం ఉదయం తన అక్క మమత, బావ హనుమంతరెడ్డితో కలసి తన పొలంలో ట్రాక్టర్ సాయంతో రాజశేఖరరెడ్డి పొలాన్ని దుక్కి చేస్తుండగా శ్రీకాంత్‌రెడ్డి కుమారులు రవికుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి అడ్డుకున్నారు. ఆ పొలం తమదని అందులో సేద్యం చేయకూడదంటూ వాదనకు దిగారు. ఆ సమయంలో సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన మమత, హనుమంతరెడ్డిపై రవికుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హనుమంతరెడ్డి, మమతని కుటుంబసభ్యులు ప్రైవేట్ వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రవికుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ

పరిగి: జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. హర్యానాలోని రోహతక్‌లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకూ గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ గ్రాప్లింగ్ కుస్తీ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏపీ తరఫున జిల్లాకు చెందిన 9 మంది క్రీడాకారులు అండర్ 13, 15 విభాగాల్లో తలపడ్డారు. వీరిలో శ్రీచరణ్, యాహియా, ధనుంజయ వెండి, సయ్యద్, మిలాన్‌కుమార్, ప్రణవ్, చందన కాంస్య పతకాలను సాధించారు. జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ కమిటీ చైర్మన్ దినేష్ కపూర్, జనరల్ సెక్రెటరీ బీర్జూశర్మ, ఏపీ చైర్మన్ సురేంద్రారెడ్డి చేతుల మీదుగా సోమవారం వారు పతకాలను అందుకున్నారు. కోచ్‌లు రమేష్, చరణ్ పాల్గొన్నారు.

కనిపించని బంద్ ప్రభావం


రాప్తాడులో కొనసాగుతున్న వ్యాపారాలు


ఆత్మకూరులో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు


ఆత్మకూరులో తెరిచిన దుకాణాలు

- యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు
- తెరుచుకున్న ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు

రాప్తాడు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రిమాండ్‌కు వెళ్లడంతో ఆ పార్టీ నాయకులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చారు. టీడీపీకి జనసేన, సీపీఐ, లోక్‌సత్తా వివిధ పార్టీల మద్దతు బంద్‌కు ఉన్నట్లు టీడీపీ నాయకులు చెప్పుకొచ్చారు. తీరా సోమవారం ఉదయం చూస్తే ఒక్క టీడీపీ నాయకుడు, కార్యకర్త కూడా బంద్ చేయడానికి బయటకు రాలేదు. తమ అధినేతను అరెస్ట్ చేసినా టీడీపీ నాయకులే బయటకు రాకపోవడంతో రాప్తాడులో బంద్ వాతావరణం కనిపించలేదు. దీంతో దుకాణదారులు తమ దుకాణాలను యథావిధిగా తెరిచి, వ్యాపారాలు సాగించారు. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు కూడా యథావిధిగా తిరిగాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఇటుకులపల్లి సీఐ నరేంద్ర రెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, రాస్తా రోకోలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.


రాప్తాడులో 44వ జాతీయ రహదారిపై బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

ఆత్మకూరు: స్కిల్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లడంతో టీడీపీ నాయకులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే మండలంలో ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. సజావుగా వాహనాలు, ఆర్టీసీ సర్వీసులు తిరిగాయి. వ్యాపారాలు, హోటళ్లు, దుకాణాలు నిర్వహించారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌ను మాత్రం టీడీపీ నాయకులు బంద్ చేయించారు.

టీడీపీకి ప్రైవేట్ సైన్యంలా మారిన కమ్యూనిస్టులు

- బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ

రాప్తాడురూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రిమాండ్‌కు వెళ్లిన చంద్రబాబును సమర్థించి కమ్యూనిస్టులు విలువలకు తిలోదకాలు ఇస్తూ టీడీపీకి ప్రైవేట్ సైన్యంలా మారారని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ మండిపడ్డారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రూ. కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా మెక్కేసిన వారికి మద్దతు ఇవ్వడం కమ్యూనిస్టుల సిద్ధాంతమా అని ఆయన ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలు అవినీతి, అబద్ధాలతో రాజకీయాలను కలుషితం చేసిన మోసగాడు చంద్రబాబు అన్నారు. ఇలాంటివారు శాశ్వతంగా జైలులో ఉండాలని చెప్పాల్సిన కమ్యూనిస్టులు.. ఆయనకే వంతపాడడం దేనికి సంకేతం అన్నారు. అవినీతి చేసిన వారిని జైలుకు పంపాలా? బయటకు పంపాలా? జైలుకు పంపితే బంద్‌లు చేస్తారా? దానికి కమ్యూనిస్టులు మద్దతు ఇస్తారా? ఇది కమ్యూనిజానికి కళంకం కాదా? అన్నారు. ప్రజల కోసం, వారి మెరుగైన జీవితం కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులు, కరుడుగట్టిన బాబు లాంటి నేరస్తులను కాపాడడానికి పోరాటాలు చేయడం బాధాకరమన్నారు. కమ్యూనిస్టులు ప్రజాపక్షమా? చంద్రబాబు లాంటి దొంగల పక్షమా? చంద్రబాబు పక్షమయితే కమ్యూనిస్టు పార్టీలను టీడీపీలో విలీనం చేయడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడైనా కమ్యూనిస్టుల ఎజెండాను అమలు చేశారా అని నిలదీశారు.

బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి


మాట్లాడుతున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం క్రైం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతోనే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని, ఈవిషయంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని మేయర్ వసీం అన్నారు. సోమవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఉంటే చంద్రబాబు ప్రాజెక్టుల యాత్ర, నారా లోకేష్ యువగళం పాదయాత్ర, పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రశాంతంగా జరిగేవా? అని ప్రశ్నించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, మూడు దఫాలు సీఎంగా ఉన్న చంద్రబాబు అవినీతి,అక్రమాలకు పాల్పడి, వ్యవస్థలలోని కొందరి సహకారంతో బయటపడ్డారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నా, సీఎం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్లారన్నారు. నాలుగున్నరేళ్లుగా పైసా అవినీతి జరగకుండా డీబీటీ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చి, పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేశారన్నారు. చంద్రబాబు నాయుడు తనపై వచ్చిన ఆరోపణలను కోర్టులో వివరణ ఇచ్చుకొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇస్సాక్, నాయకులు ఖాజా, మధు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వైఎస్ జగన్ పెద్దపీట


అశ్వర్థనాయక్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని టీటీడీ పాలకమండలి సభ్యుడు అశ్వర్థనాయక్ అన్నారు. సోమవారం ఆయన్ను మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ధర్మకర్తల మండలి సభ్యులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలు ఎల్లప్పుడూ సీఎం జగన్‌కు రుణపడి ఉంటాయన్నారు. దేవదేవుడి చెంత సేవ చేసుకునే అవకాశం గతంలో తమ సామాజికవర్గానికి ఎప్పుడూ రాలేదన్నారు. ఆలయ అభివృద్ధి సమస్యలు తమ దృష్టికి తెస్తే టీటీడీ ద్వారా నిధులు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు ఆలయ ఈవో రమేష్‌బాబు ఆధ్వర్యంలో వేదపండితులు అశ్వర్థనాయక్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రిలాక్స్ నాగరాజు తదితరులు అశ్వర్థనాయక్‌ను సన్మానించారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు


మాట్లాడుతున్న రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్

అనంతపురం: కాలానుగుణంగా వస్తున్న మార్పులకనుగుణంగా నిరంతరం కొత్త అంశాలను అభ్యసించే నిత్య విద్యార్థుల్లా అధ్యాపకులు ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం క్యాంపస్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభమైంది. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ పవర్ కన్వర్టర్స్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ ' అనే అంశంపై ఇస్తున్న శిక్షణపై వివరించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలు ధర తక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో బ్యాటరీ మేనేజ్‌మెంట్‌పైన పరిశోధనలు కొనసాగాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బి. రవి కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ విభాగం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జే శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. అంకారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కోచింగ్‌లో రాణించాలి

అనంతపురం: క్రీడాకారులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకొని, కోచింగ్‌లో రాణించాలని ఆర్డీటీ స్పోర్ట్స్ ఫర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాయి కృష్ణ అన్నారు. సోమవారం అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో క్రికెట్ కోచ్‌ల వర్క్‌షాప్ నిర్వహించారు. కోచ్ పాత్ర, ఎల్‌టీఏడీ (లాంగ్ టర్మ్ అథ్లెటిక్ డెవలప్‌మెంట్ (ట్రస్ట్) దశలు, గ్రాస్‌రూట్ సెషన్స్, గ్రాస్‌రూట్ డెవలప్‌మెంట్, ఎఫెక్టివ్ ఆఫ్ కండక్షన్ క్రికెట్ నెట్స్, నెట్ సెషన్ అనే అంశాలపై అవగాహన కల్పించినట్లు ఆర్డీటీ స్పోర్ట్స్ ఫర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాయి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ కార్యదర్శి మధుఆచారి మాట్లాడుతూ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకొని కోచింగ్‌లో రాణించాలన్నారు. రాబోవు అనంత ప్రీమియర్ లీగ్ క్రీడాకారులు మరింత పోటీతత్వంతో మెలగాలన్నారు. జి.వంశీకృష్ణ మాట్లాడుతూ కోచ్‌ల ప్రతిభను మెరుగుపర్చేందుకు ఏఎస్ఏ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏడీసీఏ సెక్రటరీ మధుఆచారి, ఆర్డీటీ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ వంశీ కృష్ణ, యుగంధర్, కుమార్, కోచ్‌లు, 16 మంది సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు.

జోడు లింగాలకు క్షీరాభిషేకం

కూడేరు: శ్రావణ మాసం చివరి సోమవారం మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల ఆలయానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పురోహితుడు శివశంకర్ శాస్త్రి జోడు లింగాలకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో జోడు లింగాలను విశేషంగా అలంకరించారు. భక్తులు మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోనుగంటి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సమర్థవంతంగా సేవలు అందించండి

- ఎంపీడీఓలకు జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ క్లాస్

అనంతపురం సిటీ: ఉద్యోగులు సమర్థవంతంగా పని చేసి, ప్రభుత్వ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. వివిధ జిల్లాల్లో పని చేస్తూ ఎంపీడీఓలుగా పదోన్నతిపై ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిన ఎంపీడీఓలు మర్యాద పూర్వకంగా ఆమెను సోమవారం కలిశారు. వారందరికీ మండలాలు కేటాయించారు. వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పాతికేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ రాజ్ ఉద్యోగుల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉందామన్నారు.

ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు..

అనంతరం వారందరికీ మండలాలకు పోస్టింగులు ఇచ్చారు. వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చిన రఘునాథను డి.హీరేహాళ్ ఎంపీడీఓగా నియమించారు. ముకుందా రెడ్డిని బుక్కపట్నం, రాజేశ్వర్ రెడ్డిని పుట్టపర్తి ఎంపీడీఓగా నియమించారు. కర్నూలు నుంచి వచ్చిన శ్రీకాంత్ చౌదరిని ముదిగుబ్బ, అనంతపురం జెడ్పీలో పని చేస్తూ పదోన్నతి పొందిన రవిప్రసాద్‌ను అగళి, అనంతపురం నుంచి బారాన్ సాహెబ్‌ను కొత్తచెరువు ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

అలరించిన ఘంటసాల నాటక ప్రదర్శన

గుంతకల్లు: అంతరించిపోతున్న కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, టీపీఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో పట్టణ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఘంటసాల నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన భాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో సురభి నాటక కళాకారులతో సినీ సంగీతసార్వభౌములు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత విశేషాలను వివరించారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర నటులతో సన్నివేశాలతో ఆకట్టుకున్నాయి. అమరగాయకుడు ఘంటసాల గొప్పతనాన్ని అంతరించిపోతున్న కళారంగాన్ని విలువను నేటి సమాజానికి తెలియజేయాలనే సంకల్పంతో నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

పేదలను మోసం చేసేందుకు కుట్ర

తాడిపత్రి అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని షాదీఖానాలో వ్యవసాయ కార్మిక సంఘం 21 జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించడం సరికాదన్నారు. పేదలను మోసం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని పూర్తిగా పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయం, ఉపాధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు మల్లికార్జున, దేవేంద్ర, తిరుపాలు, చిన్నరాయుడు, నాగరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

15న తలనీలాల వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కుల కోసం ఈనెల 15న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే తలనీలాలు పోగుచేసుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరు రోజులుగా సాగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ముగిశాయి. శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని నగరవీధుల్లో కృష్ణ నామ స్మరణతో ఊరేగించారు. అరవిందనగర్‌లో ఏర్పాటు చేసిన పూలరథాన్ని సబ్ రిజిస్ట్రార్ ఆలీ ప్రారంభించారు. ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేసి, జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ధర్మాల స్థాపనపై వివరించారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు సుధాకర్, పద్మావతి, అనరాధ, నాగమణి, జాహ్నవి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు


జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నట్లు హౌసింగ్ ఈఈ శంకర్‌లాల్ తెలిపారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కాలనీలో 50కి ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా వాటిలో ప్రస్తుతం 10 ఇళ్లకు మోల్డింగ్ పనులు చేస్తున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. ఆప్షన్- 3 కింద నిర్మిస్తున్న ఈ ఇళ్ల నిర్మాణాలను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, హౌసింగ్ అధికారులతో కలిసి నిర్మాణాలు చేయిస్తున్నారు. కార్యక్రమంలో దృశ్య కళల అకాడమీ స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్, హౌసింగ్ ఏఈ చిరంజీవి, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన యంత్రాలు అందజేయాలి


మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను సోమవారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సందర్శించారు. వ్యవసాయ యంత్రాల నాణ్యతను పరిశీలించి, రైతులకు క్వాలిటీ యంత్ర పరికరాలు అందజేయాలన్నారు. అలాగే టెస్టింగ్ సెంటర్‌లో యంత్ర పరికరాలను పరిశీలించారు. అనంతరం ట్రాక్టర్ నగర్ ద్వారా రైతులకు అందుతున్న సేవ కార్యక్రమాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్ నగర్‌ను రైతులు, అగ్రికల్చర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ బాలాజీ మురారి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, కమలాబాయి, నితీష్ శర్మ, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా తదితర పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అండర్ -14, అండర్-17 బాల బాలికల క్రీడా పోటీలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు.

ప్రైవేట్ టీచర్‌కు సౌత్ ఇండియా ఐకానిక్ అవార్డు


అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

రాప్తాడురూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు అందజేసే సౌత్ ఇండియా ఐకానిక్ అవార్డుకు నగరంలోని బృహస్పతి పాఠశాల ఇంగ్లిష్ టీచరు మండ్లి కిశోర్‌కుమార్ ఎంపికయ్యాడు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో గుంటూరు కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా కిశోర్‌కుమార్ అవార్డు అందుకున్నాడు. అనంతవాసికి సౌత్ ఇండియా అవార్డు దక్కడం గర్వకారణమని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేశాయి.

16 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: ఈనెల 16 నుంచి 29 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 29వ తేదీ వరకు సీహెచ్ఓ, ఏఎన్ఎం, వలంటీర్లు వారికి కేటాయించిన గృహాలకు వెళ్లి ఆరోగ్య ప్రశ్నావళిలోని ప్రశ్నలను కుటుంబంలో ప్రతి ఒక్కరినీ అడిగి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలుంటే వారిని ఈ నెల 30 నుంచి వచ్చే నెల 17 వరకు నిర్వహించనున్న మెడికల్ క్యాంపునకు పంపాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణి, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

పెద్దవడుగూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వివరాలు.. సోమవారం సాయంత్రం విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్ సురేష్ ద్విచక్ర వాహనంలో పామిడికి బయలుదేరారు. మిడతూరు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పామిడికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కొర్రకోడు వీహెచ్‌ఏగా గిరీష్

కూడేరు: మండలంలోని కొర్రకోడు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ)గా గిరీష్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు చేసుకొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టైశ్వర్యేశ్వర స్వామి లింగ ప్రతిష్ట


తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: నగర శివారులోని నారాయణపురం పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన అష్టైశ్వర్యేశ్వర స్వామి లింగ ప్రతిష్ట సోమవారం శాస్త్రోక్తంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహంతో పాటు నందీశ్వరుడు, ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ట జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని, స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ధర్మకర్త ముత్యాలన్న, ఓబులపతి, ఇతర కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు మల్లెల వేణుగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: పూడికతీత వేగవంతంగా చేయాలని అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. 38వ డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. నగరంలో వివిధ డివిజన్లలో పూడికతీత పనులు చేపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడేను పాటించాలన్నారు. అనంతరం 38వ డివిజన్‌లో జరుగుతున్న వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న తీరును మేయర్ స్వయంగా పరిశీలించారు. మేయర్ వెంట నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, కృష్ణ తదితరులున్నారు.

రేపు మండల స్థాయి క్రీడాపోటీలు

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు. దీనిపై సోమవారం ఆయన స్థానిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవితో కలిసి షెడ్యూల్ విడుదల చేశారు. బాలబాలికలకు రెండు విభాగాలుగా జరిగే ఈ పోటీల్లో కబడీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నికాయిట్‌తో పాటు కొన్ని అథ్లెటిక్స్ ఉంటాయన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఐదుగురికి గాయాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలోని వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. వృద్ధుడు, మరో యువతి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మరో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువతులు వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియరాలేదు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఇందిరానగర్ సమీపంలోని గంగానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి నీళ్లు పెడుతూ ప్రమాదవశాత్తూ కిందపడి లక్ష్మీనారాయణ (40) మృతిచెందాడు. త్రీటౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపిన మేరకు..స్థానిక గంగానగర్‌కు చెందిన పుల్లలరేవు దామోదర్‌రెడ్డి ఇంటినిర్మాణ పనులకోసం వాచ్‌మెన్‌గా నగరూరు లక్ష్మీనారాయణ ఉన్నాడు. సోమవారం భవనానికి నీళ్లు పెట్టేందుకు మూడో ఫ్లోర్ ఎక్కి నీళ్లు పడుతుండగా జారికిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానికులు, భవన యజమాని త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ప్రమాదంపై ఆరాతీశారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.